
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 ఏప్రిల్ 2025







పీలేరులోని ఏపీఐఐసీ-3 లేఅవుట్

- పేట్రేగుతున్న కబ్జారాయుళ్లు
- నిత్యం బెదిరింపులు, సెటిల్మెంట్లు
- స్వతంత్ర రాజుల్లా వ్యవహరిస్తున్న గ్రామీణ నేతలు

పీలేరులో మళ్లీ ఆక్రమణల కలకలం

పీలేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న పీలేరు పట్టణ పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో మళ్లీ ఆక్రమణదారుల కదలికలు పెరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పూర్తిగా కనుమరుగైపోయిన ఆక్రమణలు, సెటిల్మెంట్లు నెల రోజులుగా మళ్లీ ఊపందుకున్నాయని కాలనీ వాసులు, ప్రభుత్వ గృహపథకం లబ్ధిదారులు వాపోతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాబందుల్లా ఆక్రమణదారులు వాలిపోతున్నారని, అసలైన లబ్ధిదారులను నయానో భయానో తమ దారికి తెచ్చుకుని ఆయా ఇంటి స్థలాలను చేజిక్కించుకుని తమకు కావాల్సిన వారికి విక్రయించుకుని లక్షల్లో గడిస్తున్నారు. వీటికి కొంత మంది టీడీపీ నాయకుల సహకారం కూడా ఉంటోందనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ప్రధానంగా కోటపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాలనీ, పీలేరు-తిరుపతి మార్గంలో ఏర్పాటు చేసిన లోకేశ్ కాలనీ, ఏపీఐఐసీ-3 లేఔట్లలో అక్రమార్కుల ఆగడాలు పెచ్చుమీరుతున్నట్లు అటు రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఇటు అధికార పార్టీ నేతలకూ సమాచారం ఉంది. గతంలో పలుమార్లు ఒకే ఇంటి స్థలం కోసం రెండు గ్రూపులు రంగంలోకి దిగి ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పుడు పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆదాయ మార్గాలుగా వైసీపీ ఇళ్ల పట్టాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ప్రస్తుత టీడీపీ నాయకులు తమ ఆదాయ మార్గాలుగా మలుచుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు స్థానిక వైసీపీ నాయకులు తమ పరపతిని బట్టి ఖాళీ ఇంటి పట్టాలను పదుల సంఖ్యలో చేజిక్కించుకుని వ్యాపారం సాగించుకున్నారు. ఖాళీ పట్టాలలో తమకు కావాల్సిన విధంగా ఇంటి ప్లాట్ నెంబర్లు వేసుకుని కాలనీల్లోని రోడ్లు, సామాజిక అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలను సైతం యథేచ్ఛగా ఆక్రమించి వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఆ కార్యక్రమాలనే ప్రస్తుతం టీడీపీ నాయకులు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం కొలువు తీరిన తరువాత స్థానిక కాలనీల్లోని అక్రమాలు, ఆక్రమణలపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ సహకారంతో పట్టణంలోని కాలనీలపై సమగ్రంగా విచారణ చేపట్టారు. విచారణలో వైసీపీ నాయకుల ఆక్రమణలు చాలా వరకు వెలుగు చూశాయి. దీంతో వారి వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన చాలామంది తాము మోసపోయినట్లు గ్రహించి తమకు న్యాయం చేయమని అటు రెవెన్యూ ఇటు టీడీపీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రంగంలోకి దిగిన చాలా మంది గ్రూపులుగా ఏర్పడి ఆ వ్యవహారాలను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఉన్నందున ఆయా ప్లాట్లను తమకు అప్పగించాలని, లేకపోతే మొదటికే మోసం వస్తుందని అటు లబ్ధిదారులు, ఇటు వైసీపీ నాయకులను బెదిరించి తమ దారికి తెచ్చుకుంటున్నారు. అంతో ఇంతో వారి చేతుల్లో పెట్టి ఆయా ప్లాట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. అందులోనూ పీలేరు పట్టణానికి ఆనుకుని బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, ఎర్రగుంటపల్లె గ్రామాల్లో కాలనీలు ఉండడంతో అక్కడ తమ పెత్తనమే సాగాలంటూ పీలేరుకు చెందిన నాయకులను సైతం ఖాతరు చేయడం లేదు. ఒక్కోసారి వారి మధ్య గ్రూపులు ఏర్పడి ఘర్షణలు సైతం తలెత్తే పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఫిర్యాదులు వస్తున్న విషయం వాస్తవమే..

కాలనీల్లో ఆక్రమణలపై ఇటీవలి కాలంలో ఫిర్యాదులు ఎక్కువైన మాట వాస్తవమేనని పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఒకచోట కట్టడి చేసేలోపు మరోచోట ఆక్రమణలు జరుగుతున్నట్లు సమాచారం వస్తోందని వారు తెలిపారు. ఒక ఫిర్యాదును కూలంకషంగా విచారించి, రికార్డులు పరిశీలించే లోపు మరోచోట ఆక్రమణలు బహిర్గతమవుతున్నాయని వారు చెప్పడం గమనార్హం.

- తహసీల్దార్ భీమేశ్వర రావు, ఎస్ఐ బాలకృష్ణ

స్వతంత్ర రాజుల్లా వ్యవహరిస్తున్న గ్రామీణ నేతలు

పీలేరు పట్టణానికి ఆనుకుని ఉన్న బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, ఎర్రగుంటపల్లె, దొడ్డిపల్లె గ్రామ పంచాయతీలకు చెందిన పలువురు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు స్వతంత్ర రాజుల్లా వ్యవహరిస్తున్నారు. వారి వ్యవహార శైలి కారణంగానే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని పీలేరుకు చెందిన నాయకులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కాలనీ స్థలాలు తమ గ్రామ పరిధిలో ఉన్నాయి కాబట్టి వాటిపై పెత్తనం తమకే కావాలని, పీలేరుకు చెందిన నాయకులు వాటి వ్యవహారాల్లో కలుగజేసుకోకూడదంటూ షరతులు విధిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కారణంగా వారిని కట్టడి చేయలేక, తమ దగ్గరకు వస్తున్న బాధితులకు న్యాయం చేయలేక పీలేరుకు చెందిన అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.



పీలేరు కోటపల్లె సమీపంలోని ఎన్టీఆర్ కాలనీ



ఎన్టీఆర్ కాలనీలో ఇరువర్గాలకు సర్దిచెబుతున్న ఎస్ఐ బాలకృష్ణ (ఫైల్)

కేరళ మదనపల్లె

- జోరుగా లాటరీ టికెట్ల వ్యాపారం
- వ్యాట్సప్ గ్రూపుల్లో అమ్మకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

మదనపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో లాటరీ టికెట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. నిషేధిత ఈ వ్యాపార జూదాన్ని కొందరు ఏజెంట్లు చాపకింద నీరులా కొనసాగిస్తున్నారు. కేరళకు చెందిన లాటరీ టికెట్లను తమిళనాడుకు చెందిన కొందరు వ్యాపారులు..ఇక్కడి ఏజెంట్లకు చేరవేసి విక్రయాలు చేస్తున్నారు. జూదరులతో కూడిన వ్యాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి టికెట్లను అందులో పోస్ట్ చేసి అమ్ముతున్నట్లు చెబుతున్నారు. అలాగే కొందరికి వ్యక్తిగతం గాను చేరవేస్తున్నారు. ముఖ్యంగా ఏజెంట్లు పట్టణంలోని చిత్తూరు బస్టాండు, బెంగళూరు బస్టాండు, నీరుగట్టువారిపల్లె ఏరియాలలో ఉంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీటిని విక్రయిస్తున్నారు. టికెట్లు కొనుగోలు చేసిన జూదరులు మరుసటి రోజు ఫలితం కోసం అదే వ్యాట్సప్ గ్రూపుతో పాటు నెట్‌లో అన్వేషిస్తున్నారు. మదనపల్లెతో పాటు పుంగనూరు, అంగళ్లు, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పీలేరు, తదితర ప్రాంతాల్లో ఏజెంట్ల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా చాపకింద నీరులా సాగుతున్న ఈ క్రీడకు ఏడాది క్రితం బ్రేక్ పడింది. అయితే ఆరు నెలలుగా తిరిగి ప్రారంభమైనట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల టికెట్ కొనుగోలు చేసిన ఓ వ్యక్తి లాటరీ టికెట్ విక్రయించిన ఏజెంట్‌తో స్థానిక నెహ్రూబజార్‌లో వివాదానికి దిగాడు. తాను కొనుగోలు చేసిన టికెట్‌కు లాటరీ తగిలిందని, తనకు డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. అయితే ఆ నెంబర్‌కు లాటరీ తగలలేదని విక్రేత చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి చివరకు ఘర్షణకు దారి తీసింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగప్రవేశం చేసిన రక్షకభటులు డీఎస్పీ బంగ్లాకు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తీగ లాగితే డొంక కదిలినట్లు నిర్వాహకులు, ఏజెంట్లు ఎవరన్న విషయాన్ని గుర్తించి గోప్యంగా ఉంచినట్లు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులతో పాటు మరో వర్గానికి నెలనెలా మామూళ్లు చెల్లిస్తూ లాటరీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. వాల్మీకిపురానికి చెందిన ఓ వ్యక్తి, మదనపల్లెకు చెందిన మరో ముగ్గురు నిర్వాహకులు కలసి లాటరీ టికెట్లు విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. కేరళ నుంచి అసలైన టికెట్లు కొన్ని తెప్పించి, మరి కొన్ని నకిలీవి ముద్రించి చెలామణి చేస్తున్నట్లు సమాచారం. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ తరహాలో మళ్లీ నిషేధిత లాటరీ టికెట్ వ్యాపారం జోరందుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం..

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి కొత్తగా వచ్చాను. లాటరీ టికెట్ల వ్యవహారంపై పూర్తి స్థాయిలో కనుక్కుంటా. ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకుంటా. నిందితులను గుర్తించి, వీటిని ప్రోత్సహిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

- మహేంద్ర, డీఎస్పీ, మదనపల్లె

రేషన్‌కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



ఎండీయూ వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లోని చౌకదుకాణాల లబ్ధిదారులు ఈనెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ నుంచి సీఎం డీటీ ఫిరోజ్ ఆధ్వర్యంలో ఎండీయూ వాహనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లో రేషన్‌కార్డు ఉన్న 12 వేల మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. రేషన్‌కార్డుదారుల వెరిఫికేషన్, మృతి చెందిన వారి పేర్లను తొలగించడం, డబుల్‌ఎంట్రీ తదితర అంశాలను ఈకేవైసీ ద్వారా ఫిల్టర్ చేస్తామన్నారు. కార్డుదారులు వారి పరిధిలోని చౌకదుకాణాలకు వెళ్లి ఈ-పోస్ మిషన్‌లో బయోమెట్రిక్ వేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. చౌకదుకాణ డీలర్లు కళాధర్, మౌలా, ఖాసీమ్, ఎండీయూ వాహనదారుల అధ్యక్షుడు షాకీర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీలు కీలకపాత్ర పోషించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి పంచాయతీ సెక్రటరీలు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలతో గ్రామాలు, మండలాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, పన్నుల నిర్వహణ, నీటి సరఫరా, గ్రీన్ అంబాసిడర్లు తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలకు కేటాయించిన మొత్తం 29 రకాల విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉండరాదని, ఏ ప్రాంతాల్లో తాగునీటి సమస్య వస్తుందో ముందుగానే అంచనా వేసి తగు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించాలని ఆదేశించారు. జాతీయ రహదారుల పక్కన చెత్త కనపడకూడదని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పరిశీలించి ఎక్కడైనా చెత్త ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలతో డివిజన్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించుకుని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని డీపీవోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సుద్దరాయినీ వదల్లేదు

- గుట్టలను గుల్ల చేస్తున్న ఘనులు
- అనుమతులు లేకుండా తరలిస్తున్న వైనం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కొండలను పిండి చేశారు. కూటమి ప్రభుత్వంలోనూ గుట్టలను గుల్ల చేస్తున్నారు. మండలంలోని దేశెట్టిపల్లెకు సమీపంలో ఉన్న సుద్దరాయి గుట్టను ఎక్స్‌కవేటర్లు పెట్టి తోలుస్తూ అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. స్థానికులు వారిని నిలదీస్తే మాకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని మాకు పెద్దల అండ ఉందని వారిని బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. కొండలు, గుట్టలల్లో పశువులకు మేత కూడా లేకుండా చేస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దగ్గర ఉండే గుట్టలను తొలిచేస్తుండటంతో దూరంగా ఉన్న ప్రాంతాల్లో గడ్డి కోసం వెళుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. రోజుకు 10 నుంచి 20 ట్రాక్టర్ల సుద్దరాయిని తరలిస్తున్నారు. నియోజకవర్గంలో ఇలాంటివి పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. గ్రామస్తులు అడ్డుకున్నా ప్రయోజనం లేకుండా ఉంది. గతంలో సుద్దరాయిని ప్రజలు తమ ఇళ్ల వద్ద ఎత్తులేపడానికి ఎద్దల బండిలో అధికారుల అనుమతి తీసుకుని తరలించేవారు. ప్రస్తుతం ఏకంగా యంత్రాలు పెట్టి గుట్టలను పెకిలించేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో గుట్టలు లేకుండా పోతున్నాయి. పనులు జరుగుతుండగా దేశెట్టిపల్లె ప్రజలు అడ్డుకున్నా లెక్క చేయకుండా పనులను సాగించడం, ప్రజాప్రతినిధులకు చెప్పినా ప్రయోజనం లేకుండాపోవడం కొసమెరుపు. ఈ విషయాన్ని తహసీల్దార్ మహబూబ్‌చాంద్ దృష్టికి తీసుకెళ్లగా గుట్టల జోలికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సుద్దరాయిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం



ఎక్స్‌కవేటర్‌తో సుద్దరాయిని వెలికితీస్తున్న దృశ్యం



రోడ్డుపై వరసగా నిలిచి ఉన్న ట్రాక్టర్లు

ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. మదనపల్లె మండలం బీకేపల్లి గ్రామానికి చెందిన గంగమాత తన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లింకేజీ సమస్య ఉందని, తన సమస్యను పరిష్కరించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సుండుపల్లె మండలం రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మయ్య తన రేషన్‌కార్డును గత ప్రభుత్వంలో అకారణంగా తొలగించారని తనకు నూతన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులను ఇప్పించాల్సిందిగా విన్నవించుకున్నారు. రాయచోటికి చెందిన హజరత్ తాను ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నానని, వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నానని వైద్య ఖర్చులకు సహాయం అందించాల్సిందిగా కోరారు. రెండు సోమవారాలుగా పీజీఆర్ఎస్ లేనందువల్ల సోమవారం ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవోడీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



సుగాలిబిడికీలో రాలిపోయిన మామిడి కాయలు

గాలి వాన బీభత్సం

- కసిరెడ్డిగారిపల్లె, గోపగుడిపల్లెల్లో 200 ఎకరాల్లో మామిడికి నష్టం



నీలకంఠ్రావుపేటలో లేచిపోయిన ఇంటి పైకప్పు

రామాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గాలి, వాన బీభత్సానికి 200 ఎకరాలకుపైగా మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులు, వ్యాపారస్తులు కుదేలయ్యారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె, గోపగుడిపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల గాలి, వానకు కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని సుగాలిబిడికికి చెందిన మూడే క్రిష్ణానాయక్, మూడే రాజానాయక్, నాగరాజునాయక్, సీతారాంనాయక్, నాగేశ్వర్‌నాయక్, సర్దార్‌నాయక్, రెడ్డినాయక్, అర్జున్‌నాయక్, సరోజమ్మ, సురేశ్‌నాయక్, శంకర్‌నాయక్, లక్ష్మయ్య తదితర మరికొంత మంది రైతులకు సంబంధించిన మామిడి చెట్లు విరిగి కాయలన్నీ నేలరాలాయి. అలాగే నీలకంఠ్రావుపేట, గాండ్లపల్లికు చెందిన ప్రవీణ్ మరికొంత మందికి సంబంధించిన ఇంటిపైకప్పు రేకులు లేచిపోయాయి.

ఉద్యాన రైతు విల..విల...

- దోస, కర్బూజ, టమోటా, వంగ ధరలు పతనం
- బయటి రాష్ట్రాల్లో తగ్గిన డిమాండ్
- కుప్పకూలిన ధరలు
- తీవ్ర నష్టాలతో అప్పుల్లో అన్నదాతలు

ములకలచెరువు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా నాలుగు పంటల ధరలు పతనమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు కుమిలిపోతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలకు ధరల రూపంలో వచ్చిన కష్టం రైతులను ముంచింది. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు పాతాళానికి చేరడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక విలవిలలాడుతున్నాడు. ధరలు లేక ఏం చేయలేక చేతికొచ్చిన పంటలను కోత విధించకుండా పొలాల్లోనే వదిలి వేయాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా ధరలు లేక పొలాల్లోనే వదిలేసిన దోస, టమోటాలు, కర్బూజ, వంకాయలు దర్శనమిస్తున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో వేలాది ఎకరాల్లో టమోటా, దోస, కర్బూజ, వంగ పంటలు సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం సాగైన పంటల్లో దిగుబడి వస్తోంది. దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి.

టమోటా రైతుకు కన్నీరే మిగిలింది...


సోంపల్లె సమీపంలో పొలంలోనే వదిలేసిన టమోటాలు

టమోటా ధరలు నాలుగున్నర నెలలుగా కుప్పకూలడంతో రైతులు అల్లాడిపోతున్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా సాగవుతుంది. ఈ ప్రాంతంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా సాగైంది. నాలుగున్నర నెలల క్రితం ఆశాజనకంగా ఉన్న టమోటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలి పాతాళానికి చేరాయి. అప్పటి నుంచి టమోటా రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో టమోటా రైతులు కుమిలిపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. నాలుగున్నర నెలలుగా 23 కేజీల బాక్సు కేవలం రూ.50 నుంచి రూ.200లోపే పలుకుతోంది. దీంతో టమోటా రైతులకు తీవ్ర నష్టం చేకూరింది.

దోస కాయలు అడిగేవారు కరువయ్యారు



ఏడు ఎకరాల్లో దోస పంట సాగు చేశా. దీనికి గానూ రూ.12 లక్షలు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. తోట దగ్గరకు వచ్చి కేజీ రూ.4నుంచి రూ.5కు అడుగుతున్నారు. మొదటి కోతకు రూ.3 లక్షలు వచ్చింది. అంతే తరువాత దోస అడిగే వారు లేరు. దీంతో కాయలు తోటలోనే వదిలేశాను. పెట్టుబడి కూడా రాలేదు. దోస పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను.

- వెంకటరమణారెడ్డి, దోస రైతు, వేపూరికోట

రూ.18 నుంచి రూ.5కు పడిపోయిన కర్బూజ


వేపూరికోట వద్ద కోయకుండా వదిలేసిన కర్బూజ కాయలు

కర్బూజ పంట కూడా రైతులకు కన్నీళ్లు మిగిల్చుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పుడు ధరల రూపంలో మరో కష్టం వచ్చి పడింది. నెల రోజులకు ముందే భారీగా దిగుబడి వచ్చిన కర్బూజ రైతులకు వైరస్ రూపంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో పంట అధికంగా సాగు కావడం, దిగుబడి బాగా వస్తుండడంతో ఇక్కడ డిమాండ్ పడిపోయింది. దీంతో ధరలు పతనమయ్యాయి. నెల రోజులకు ముందు కేజీ రూ.18 పలికిన ధర ఇప్పుడు రూ.5కు చేరింది. దీంతో అడిగేవారు లేక రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

టమోటా పంట ముంచింది



టమోటా పంట వరుసగా సాగు చేయడంతో నష్టాలే మిగిలాయి. ధర ఉంటుందేమోనన్న ఆశతో ప్రస్తుతం ఆరు ఎకరాల్లో టమోటా సాగు చేశా. దీనికి గాను రూ.10 లక్షలు ఖర్చు వచ్చింది. టమోటా ధరలు కుప్పకూలడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనపడడం లేదు. గతంలో కూడా చేసి ధర లేకపోవడంతో నష్టపోయాను.

-మల్లికార్జునరెడ్డి, టమోటా రైతు, పర్తికోట

పాతాళానికి పడిపోయిన దోస ధరలు


వేపూరికోట సమీపంలో పొలంలోనే దోస కాయలు

దోస ధరలు పాతాళానికి చేరుకోవడంతో రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. దోస సాగు చేసిన రైతులను ధరలు నట్టేట ముంచాయి. 15 రోజుల క్రితం వరకు కేజీ రూ.20 పలికిన దోస ధర పతనమై రూ.5కి చేరింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 300 ఎకరాలకుపైగా దోస పంట సాగు చేశారు. ఇక్కడ పండిన దోస ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని పలు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్న రాష్ట్రాల్లో ప్రస్తుతం దోస పంట అధికంగా సాగై దిగుబడి భారీగా వస్తుండడంతో ఇక్కడి దోస ధరలు కుప్పకూలాయి.

వంగ సాగు చేసి తీవ్రంగా నష్టపోయా



భూమిని కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వంగ పంట సాగు చేశా. దీనికి గానూ రూ.4.50 లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. పంట దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి. కాయలు కోత విధిస్తే కూలీ ఖర్చు కూడా రావడం లేదు. చేసేది లేక కాయలు కోయకుండా పొలంలోనే వదిలేశా. దీంతో వదిలేసిన వంకాయలు కళ్లెదుటే ఎండిపోతుండడంతో మనసు కలచివేస్తోంది.

- బాలాజీ, వంగ రైతు, గురికివారిపల్లె

రూ.25 నుంచి 10కి పడిపోయిన వంగ ధర


పెద్దపాళ్యం సమీపంలో వదిలేసిన వంకాయలు

వంగ ధర కూడా పతనమైంది. నెల రోజుల క్రితం వరకు రూ.25 పలికిన కేజీ ధర క్రమంగా తగ్గుతూ రూ.10కి పడిపోయింది. నిన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న వంగ ధరలు కుప్పకూలాయి. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రైతులు సుమారు 500 ఎకరాలకుపైగా సాగు చేశారు.

వ్యాపారులు రైతుల పొలాల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తమిళనాడు రాష్ట్రంలో కూడా వంగ పంట అధికంగా సాగు కావడంతో ఇక్కడ ధరలు సగానికి పడిపోయాయి.

చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారు

- ప్రభుత్వ విప్‌కు బాధితుల ఫిర్యాదు


శాసనమండలి విప్ హరిప్రసాద్‌కు గోడు విన్నవించుకుంటున్న పొన్నేటిపాళెం వాసులు

మదనపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో వేటగాళ్ల ఉచ్చులో చిరుత మృతి చెందితే అటవీ శాఖాధికారులు అమాయక రైతులపై అక్రమ కేసులు బనాయించారని బాధితుల కుటుంబీకులు శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి రాయలసీమ కో-ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి, జనసేన సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ వెంట పొన్నేటిపాళెం గ్రామస్థులు వెళ్లారు.

ఈ సందర్భంగా హరిప్రసాద్‌తో రాందాస్‌చౌదరి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందితే అడవి పక్కన ఉన్న భూమికి చెందిన రైతులను చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా విచారణ పేరుతో పిలిపించి అరెస్టు చేసి రిమాండుకు పంపారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి బాధితుల గోడు తీసుకెళ్లి అక్రమ అరెస్టులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దీనిపై హరిప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితుల విన్నపాలను వినిపించారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని రాందాస్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో పొన్నేటిపాళెం గ్రామస్థులు సుబ్బరామిరెడ్డి, శ్రావణి, సురేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుమలత, చంద్రకళ, భార్గవి, శ్రీనివాసులు, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్ వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూ చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన 'మా ఇష్టం తోలేస్తాం' అన్న కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం మళ్లీ ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కాగా పోలీసుల సమాచారం తెలియడంతో ఆ ప్రాంతం నుంచి మరో రెండు ట్రాక్టర్లు ఉడాయించినట్లు సమాచారం. దీనిపై స్థానిక తహసీల్దార్ పామిలేటి మాట్లాడుతూ రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణాను ఇకపై ఉపేక్షించేది లేదని మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో కూడా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రిజర్వాయర్ ప్రాంతంలో గట్టి నిఘా పెట్టి ఇసుకాసురుల ఆటలు కట్టించాలని లేనిపక్షంలో పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ రేణుక



వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మాల్యం రేణుకను నియమిస్తూ ఎస్వీయూ వైస్ చాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారు. 21 సంవత్సరాలుగా అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ రేణుక ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వాల్మీకిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ జె.కృష్ణమూర్తి, సహచర అధ్యాపకులు, హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. 2004 ఏప్రిల్‌లో మదనపల్లె బీటీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులలో చేరిన ఆమె అనేక పరిశోధనలు చేయడంతో డాక్టరేట్ ఇచ్చారు. 2004 నుంచి 2021 ఆగస్టు వరకు మదనపల్లె బీటీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహించిన రేణుకను అనంతరం వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు.

భూమి విషయమై ఘర్షణ : ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.రాజంపేట గ్రామం బీసీ కాలనీలో ఆదివారం రాత్రి భూవివాదమై అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్ఐ మహ్మద్‌రఫీ కథనం మేరకు... తంగా క్రిష్టయ్య, తంగా గోపాల్ అనే ఇరువురు అన్నదమ్ములకు పెద్దలు సంపాదించిన భూమి 6 ఎకరాలు ఉంది. ఆ భూమి వారిద్దరికీ భాగపరిష్కారాల నిమిత్తం ఆదివారం అన్న క్రిష్టయ్య వద్దకు వెళ్లగా క్రిష్టయ్య వారిపై కర్రతో దాడి చేయగా గోపాల్, విష్ణు, క్రిష్టవేణి తలకు బలమైన గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్రిష్టయ్య, యల్లమ్మ, పెంచలమ్మ, గంగాదేవి, కళావతి, సాయి, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : ఏఎస్పీ


సమస్యలను తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్ణత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల మధ్య ఘర్షణ


విద్యార్థులను చెదరగొడుతున్న సీఐ కుళాయప్ప, సిబ్బంది

రాజంపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లెలో ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మన్నూరు సీఐ కుళాయప్ప తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థుల గుంపులను చెదరగొట్టారు. ఘర్షణకు కారకులైన ఐదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువురిపై కొడవలితో దాడి


దాడిలో గాయపడిన లక్ష్మిదేవి, రామక్రిష్ణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటారుకు విద్యుత్ వైరు తగిలించే విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో రేపన ప్రభాకర్ అనే వ్యక్తి ఇరువురిపై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరచాడు. రాయచోటి అర్బన్ పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం మాధవరం వడ్డెపల్లిలో రేపన లక్ష్మీదేవి తన వ్యవసాయ పొలంలో మోటారుకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన రేపన ప్రభాకర్ అనే వ్యక్తి లక్ష్మీదేవికి సంబంధించిన వ్యవసాయ మోటారు విద్యుత్ కనెక్షన్‌కు అక్రమంగా వైరు తగిలించేందుకు ప్రయత్నించగా ఆమె అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన రేపన ప్రభాకర్ తన వద్ద ఉన్న కొడవలితో ఆమెపై దాడి చేశాడు. పక్కనే ఉన్న ఆమె మేనమామ రామక్రిష్ణ అడ్డుకోవడంతో అతనిపై కూడా దాడి చేసి గాయపరిచాడు. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు


దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఆమె పర్యటించి పలు దుకాణాలను తనిఖీ చేశారు. దాదాపు అన్ని దుకాణాలు, హోటళ్లు, పండ్ల వ్యాపారులు, కిరాణా స్టోర్‌లలో డిస్పోజబుల్ గ్లాసులు, కప్పులు, కవర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమలులో ఉందని వాటిని వాడటానికి వీలు లేదన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఎన్నోసార్లు అధికారులు అవగాహనా కార్యక్రమాలు, ప్రచారాలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ కవర్ల అమ్మకం, వినియోగం పూర్తిగా ఆపివేసి ప్రత్యామ్నాయ మార్గాలు పాటించాలని ఆమె ప్రజలను కోరారు. నిబంధనలు పాటించకుండా బేఖాతరు చేసిన వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఏవో రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఖురాన్ పండితుడు మృతి



కలికిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలికిరికి చెందిన ఖురాన్ పండితుడు, ముస్లిం మత ప్రచారకుడు ఖారీ సుహేల్ సాహెబ్ (35) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని ఒక మదరసాలో ప్రధాన గురువుగా పనిచేస్తున్న సుహేల్ అక్కడ ప్రసంగాలు చేయడానికి వెళుతుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో తీవ్రగా గాయపడ్డాడు. పలమనేరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుహేల్ స్వగ్రామం కలికిరి పంచాయతీలోని రాజువారిపల్లె. సుహేల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం రాత్రి పలమనేరు మదరసా ఆవరణలోనే సుహేల్ అంత్యక్రియలు నిర్వహించారు.

రైల్వేకోడూరులో యువకుడు...


మృతి చెందిన చరణ్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ నవీన్ బాబు వివరాల మేరకు... చియ్యవరం పంచాయతీ నడింపల్లికి చెందిన చరణ్(28) బైకుపై వెళుతుండగా అదుపుతప్పి శాంతినగర్ వద్ద ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. అతివేగం లేదా అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ జ్ఞానేంద్రప్రసాద్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. కలికిరి పట్టణానికి చెందిన జ్ఞానేంద్రప్రసాద్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా సొంతూరైన కలికిరిలోనే ఉంటున్నారు. మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన సోమవారం తన ద్విచక్రవాహనంలో కలికిరికి వెళుతుండగా మండలంలోని చెరకువారిపల్లె వద్ద బొలెరో లగేజీ వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్ఞానేంద్రప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి వాహనం కోసం గాలింపు చేపట్టారు.

దారి దోపిడీ కేసులో దొంగ అరెస్ట్


దొంగ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెనగలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం చక్రంపేట వద్ద 2023 మార్చి 8వ తేదీ అర్ధరాత్రి జరిగిన దారి దోపిడీ కేసులో నిందితుడిగా ఉన్న కందుల బాలవర్ధన్‌నాయుడిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పెనగలూరు దళితవాడకు చెందిన మీసాల నవీన్‌కుమార్ ఇంటికి వస్తుండగా సాయివికాస్ పాఠశాల సమీపంలో స్పీడు బ్రేకరు వద్ద వేచి ఉన్న టి.పెంచలయ్య అలియాస్ చిన్న, కె.బాలవర్ధన్‌నాయుడు అలియాస్ బాలు కలిసి నవీన్ కుమార్‌కు కత్తితో బెదిరించి రూ.5 వేలు దోపిడీ చేశారు. బాలవర్ధన్ పరారీలో ఉండి 10 రోజుల కిందట సొంతూరు చక్రంపేటకు రాగా అతడి కోసం గాలిస్తున్న పెనగలూరు పోలీసులు ముద్రపల్లె క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వల్లి, కానిస్టేబుళ్లు రవిశంకర్, హరిబాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిద్దవటం పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం పెన్నానది వంతెన సమీపంలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ వృద్ధురాలిని సోమవారం పోలీసులు కాపాడి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహ్మద్ రఫీ మాట్లాడుతూ లోలెవల్ వంతెన సమీపంలో ఓ వృద్ధురాలు పెన్నానదిలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్లు గ్రామస్థులు సమాచారం తెలపడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కాపాడి పరమాత్మసేవా ఆశ్రమంలో ఉంచామన్నారు. ఎవరైనా ఆమెను గుర్తిస్తే 9121100581, 9121100584 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తులను లీజుకిచ్చే ప్రతిపాదనలు తగవు

● కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు చట్టం కాకముందే కేంద్ర ప్రభుత్వం లీజు పేరుతో కార్పొరేట్లకు దాదాపు 99 సంవత్సరాలకు లీజు కిచ్చే ప్రతిపాదనలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి అన్నారు. అణగారిన వర్గాల రక్షణ, రాజ్యాంగ హక్కులను కాలరాయడమే ధ్యేయంగా కేంద్రంలోని మోడీసర్కార్ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం, రాజ్యాంగ బద్ధత సవాళ్లు అనే అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు ముస్లిం ప్రజల ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా పాలన సాగిస్తోందన్నారు. ఆ కోవలో గత 2014 సంవత్సరం నుండే అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వాల రాష్ట్ర ముఖ్యమంత్రులు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చట్టం కాకముందే వేలాది ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపుల పర్వానికి శ్రీకారం చుట్టడం సరి కాదన్నారు. సుమారు 1000 సంవత్సరాల క్రితం దేశాన్ని పాలించిన నవాబులు దాతృత్వంతో ఇచ్చిన ఆస్తులకు దస్తావేజులు లేవన్నారు. అలాంటి వాటిని బై యూజర్ పేరిట స్వాధీనం చేసుకునేందుకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లు చట్టం కాకముందే 52 బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు 99 సంవత్సరాలకు లీజు పేరుతో ప్రధాన నగరాలలోని విలువైన స్థలాలు, భవంతులు ఇవ్వడానికి ముందస్తుగా ప్రతిపాదనలు తయారు చేసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, డబ్బ్యు రాము, ఓబయ్య, సగిలి గుర్రప్ప, బాబు భాయ్, డాక్టర్ గోపాల్, దేవర శ్రీకృష్ణ, పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందంగా కట్టి వదిలేశారు...

● నిరుపయోగంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్‌లు

● ప్రభుత్వ ధనం వృథా ● పట్టించుకోని పాలకులు



ప్రారంభానికి నోచుకోని ముద్దనూరు సచివాలయం, ఆర్బీకే భవనం



శెట్టివారిపల్లెలో ప్రారంభం కాని సచివాలయం



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన శెట్టివారిపల్లె ఆర్బీకే భవనం

ముద్దనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. నిర్మాణాలూ మొదలు పెట్టారు. చాలా వరకు పూర్తయ్యాయి. అయితే చాలా చోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అసంపూర్తిగా, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగానూ మారుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలను 12 సచివాలయ కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. అన్ని చోట్లా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ నాయకులకే సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణ పనులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలోనే భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

బిల్లులు చెల్లించకపోవడంతో అరకొర పనులు పెండింగ్‌లో పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ నూతన భవనాలు ప్రారంభించారు. ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్న కొన్నింటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. యామవరంలో ఆర్బీకే, ముద్దనూరు 1, 2 సచివాలయం, ఆర్బీకే, శెట్టివారిపల్లెలో సచివాలయం, ఆర్బీకే, తిమ్మాపురం సచివాలయం, ఆర్బీకే, కొలవలి, సచివాలయం, పెనికెలపాడు సచివాలయం, ఆర్బీకే భవనాలకు సంబంధించి అరకొర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు సంవత్సరాలుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. కేవలం వైసీపీ ప్రభుత్వంలో నిధులు చెల్లించక పోవడంతోనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలో నైనా అవి శిథిలావస్థకు చేరుకోక ముందే ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ మునికుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మండలంలో కొన్ని సచివాలయాలు, ఆర్బీకే నూతన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి అప్పగిస్తే బిల్లులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఉత్సాహంగా సాగిన బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభరాజములు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఒంగోలుజాతి వృషభరాజముల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం 11వ రోజు స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అశ్వవాహనంపై స్వామివారిని ఆశీలను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన బంటుపల్లి గోపాల్‌యాదవ్‌కు చెందని ఎడ్ల మొదటి స్థానంలో నిలిచి రూ.100116 అందుకున్నారు. అనంతపురం జిల్లా మేడిమాకుపల్లెకు చెందిన తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయస్థానంలో నిలిచి రూ.75,116, రామేశ్వరానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు తృతీయస్థానంలో నిలిచి రూ.50,116 గెలుపొంది నగదు బహుమతులు అందుకున్నారు. బండలాగుడు పోటీలు సందర్భంగా రామేశ్వరం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మైదుకూరులో రసవత్తరంగా...



మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు నగదు అందజేస్తున్న కశెట్టి కిరణ్‌కుమార్

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో అంకాలమ్మతల్లి తిరుణాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలకు చెందిన బోరెడ్డి వీరనరసింహారెడ్డి, సుంకి సురేంద్రరెడ్డిల ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.1,50,000లను అందుకున్నారు. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేశ్ యాదవ్ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.1,00,000, సిరివెళ్ల మండలం గుండ్రమాన్‌దిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.75వేలు, నంద్యాల జిల్లా పెసరవాయికు చెందిన సయ్యద్ కలాంబాషా ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ.50వేలు, ఖాజీపేట మండలం పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య, బోలా వెంకటయ్యలకు చెందిన ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.30వేలు బహుమతి సాధించాయి. కార్యక్రమంలో లక్ష్మి బిల్డర్స్ అధినేత కశెట్టి కిరణ్‌కుమార్, కశెట్టి నర సింహులు, కశెట్టి రవికుమార్, కొమ్మురి సురేష్‌బాబు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఓ ఇంటిలో జరిగిన బంగారు నగల చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీలో మార్చి 24వ తేదీ కరపాకుల సుజాత భర్త చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటిలో పూజల పేరుతో పది తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి సీసీ ఫుటేజీ ద్వారా నిందితుల సమాచారం తెలుసుకున్నారన్నారు.

కర్నూలు జిల్లా సిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన కనకమ్మ, ముదిర్నే శ్రీనివాసులు ప్రస్తుతం ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో ఉండేవారు. వీరు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు వెళ్లి వారి ఇళ్లలో, అనారోగ్య సమస్యలను పూజలు చేసి నయం చేస్తామని మాయమాటలు చెప్పేవారు. పూజలు చేసే సమయంలో బంగారు లేక వెండి వస్తువులు ఉంచితే మంచి ఫలితం వస్తుందని మోసపూరిత మాటలు చెప్పి ఆభరణాలు చోరీ చేసేవారు. వీరిపై నిఘా పెట్టి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసును చేధించిన సీఐ, ఎస్ఐలతో పాటు పోలీసులు హైమావతి, దేవదాసు, రియాజ్, నాగేంద్రలను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొరిచెరువు వద్ద రవికుమార్ (45) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ చెట్టుకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రవికుమార్ గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురం వాసి. మంచాలకు వైర్లు అల్లుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో మంచాలకు వైర్లు అల్లుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా గాలివాన బీభత్సానికి ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. ఈ విషయాన్ని పశువుల కాపరులు గుర్తించి తమకు సమాచారం అందించారని ఎస్ఐ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

చిలమకూరు అల్ట్రాటెక్ మైన్స్ టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లను జడ్పీ హైస్కూల్ మైదానంలో ఉంచిన దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిలమకూరులోని అల్ట్రాటెక్ మైన్స్ నుంచి ఫ్యాక్టరీలోకి సున్నపురాయిని రవాణా చేస్తున్న 5 టిప్పర్లను ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు సోమవారం సీజ్ చేశారు. నిబంధనలకు మించి ఓవర్‌లోడ్‌తో వెళుతున్న దృష్ట్యా టిప్పర్లను సీజ్ చేసి.. రవాణాశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా, ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి మధ్య వివాదం నడుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిప్పర్లను సీజ్ చేయడంతో స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో ప్లాంటు వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

17 మందిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. భార్య, భర్తల పంచాయతీ విషయంపై ఈ ఘర్షణ చోటు చేసుకోగా ఇరువర్గాలకు చెందిన మున్వర్, బాదుల్లా, నందిపల్లె వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డితో పాటు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీలు అందుకుంటున్న తేజోమయి, లక్ష్మీమనుశ్రీ

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో ఈనెల 20న జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ ప్రతిభ కనబరచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. అండర్-15, అండర్-11 బాలికల విభాగంలో తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ 5వ స్థానం సాధించి ట్రోఫీలు అందుకున్నారని.. ఈ టోర్నమెంట్‌లో 266 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

సీసీ రోడ్ల నాణ్యతపై విజిలెన్స్ తనిఖీలు

లింగాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాడా నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్ల నాణ్యతను సోమవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. మండలంలోని దొండ్లవాగు గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన మూడు సిమెంటు రోడ్లను, పెద్దకుడాలలో ఒక సిమెంటురోడ్డు నాణ్యతను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. వారి వెంట పంచాయతీ రాజ్ అధికారులు ఉన్నారు.


భార్యాభర్తల మధ్య ఘర్షణ..ముగ్గురిపై కేసు

పులివెందుల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెకు చెందిన దుర్గారావు దంపతుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. దుర్గారావు అతని భార్య మధ్య మనస్పర్థలతో గొడవలు జరిగేవి. దీంతో దుర్గారావుపై అతని అత్త వరలక్ష్మి, మామ లక్ష్మణ్, బామర్ది దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటి బిల్లులకు మోక్షం ఎప్పుడో...

● ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు

● గండికోట నిర్వాసితుల ఆవేదన



కొండాపురం రామచంద్రనగర్ పునరావాస కాలనీలో పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లు

కొండాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పునరావాసం కింద అందాల్సిన ఇంటి బిల్లులు గత ఎనిమిదేళ్లుగా రాకపోవడంతో గండికోట నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. వీరిని పునరావాస పరిహారం కింద రెండు కేటగిరిలుగా విభజించారు. ఒకటి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పూర్తిగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తారు. రెండోది ఇంటిస్థలం కావాలనుకుంటే రూ.3లక్షలు పట్టుకొని రూ.7లక్షలు చెల్లిస్తారు. ఇందులో రూ. 3 లక్షల్లో రూ.1,14,000 గాను ఐదు సెంట్ల ఇంటిస్థలం, పునరావాస కాలనీ డెవలప్‌మెంట్‌కు అంటే.. రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదిర వాటికి పట్టుకుంటారు. మిగిలిన రూ.1,86,000 నిర్వాసితుడు ఇళ్లు కట్టుకునేటప్పుడు తిరిగి చెల్లిస్తారు. ఎనిమిదేళ్ల కిందట మొదటిసారి పునరావాస పరిహారం చెల్లించినప్పుడు కొంతమంది నిర్వాసితులకు ఇంటి బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత దీని గురించి ఊసే లేకపోవడంతో బిల్లులు అందని వారు ఆందోళన చెందుతున్నారు.

అయోమయంలో గండికోట నిర్వాసితులు

తమకు ఇచ్చే రూ.10లక్షల పరిహారంలో ఇంటి నిర్మాణానికి తిరిగి రూ.1,86,000 చెల్లి స్తామని గతంలో అధికారులు చెప్పి ఒప్పించారు. దీని ప్రకారం 2017వ సంవత్సరం వరకు కొంతమందికి ఇంటి నిర్మా ణానికి బిల్లులు పడ్డాయి. ఆ తర్వాత బిల్లులు రాకపో వడంతో ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. అధికారు లను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని.. అదే విధంగా రూ.7 లక్షల పరిహారం తీసుకున్నవారికి ప్రభుత్వం కొత్తగా పక్కాగృహాలు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

వెంటనే బిల్లులు చెల్లించాలి



గత టీడీపీ ప్రభుత్వంలో కొంత మందికి ఇంటి బిల్లులు వచ్చాయి. ఎనిమిదేళ్ల నుంచి పునరావాసం కింద ఇంటి బిల్లులు రాలేదు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానలు చెబుతున్నారు. కొంత మంది అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే రూ.1,86,000 ఇంటి బిల్లు చెల్లించాలి.

-ఎం.మనోహర్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి, కొండాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూడా ఉన్న తాధికారులతో మాట్లాడారు. ఈ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉంది.

-గురురాజ, హౌసింగ్ ఏఈ, కొండాపురం

వెంటనే కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు రావలసిన ఇంటి బిల్లు రూ.1,86,000 చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

చెత్తా లేదు.. సేకరణా లేదు..ఎరువు తయారీ ఊసే లేదు

● శిథిలావస్థలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ● 15 టన్నుల వానపాములు సరఫరా చేశామంటున్న అధికారులు ● కూటమి ప్రభుత్వంలోనైనా తిరిగి సంపద తయారీ కేంద్రాలకు మోక్షం కలిగేనా..

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ చేపట్టడమే కాకుండా గ్రామ పంచాయతీలను స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేసే లక్ష్యంతో 2017-18 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ప్రభుత్వం మారడంతో గత 8 ఏళ్లుగా మూలనపడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. 2018 సంవత్సరం నుంచి నేటి వరకు జిల్లా పంచాయతీ అధికారులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల బాగోగులు పట్టించుకోకపోవడంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నేడు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. చెత్త లేదు.. సేకరణ లేదు... సంపద తయారు అసలే లేదు.. అన్నట్లు తయారైంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు 15 టన్నుల వానపాములను సప్లై చేశామని జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నప్పటికీ వాటిని ఎక్కడ వదిలారో, ఎక్కడ సంపద తయారు చేస్తున్నారో ఎవరికీ అర్థం కాని విషయం.

493 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయి.. 62 నిర్మాణంలో ఉన్నాయి

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 501 గ్రామ పంచాయతీలకు



శిథిలావస్థలో ఉన్న రాయచోటి మండలం దిగువ అబ్బవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

గానూ 439 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం పూర్తయి రన్నింగ్‌లో ఉండగా 62 గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్నాయని జిల్లా పంచాయతీ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గ్రామ సేవలను స్వచ్ఛ గ్రామ సీమలుగా తయారు చేయడమే కాకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు నిధులు వెచ్చించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చెత్త సేకరణ కోసం ఆటోలతో పాటు తోపుడు బండ్లను తీసుకొచ్చి చెత్తసేకరణ కోసం గ్రామాల విస్తీర్ణత, జనాభాను బట్టి 3 నుండి 5 మంది వరకు ఇలా గ్రీన్ అంబాసిడర్లను కూడా నియమించారు.2019లో ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మూలన పడేయడంతో అవి నేడు శిథిలావస్థకు చేరుకుని కంపచెట్లు, పిచ్చిమొక్కలతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. అయితే తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత వైసీపీ ప్రభుత్వంలో మూలనపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తిరిగి అందుబాటులోకి వస్తాయని, అక్కడ పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు ఇతర గ్రామ పంచాయతీ వర్కర్లకు ఉపాధి లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం గ్రామ సీమలపై ప్రత్యేక దృష్టి సారించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ప్రతి మండలం నుంచి 5 గ్రామ పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు పూర్వ వైభవంగా తీసుకొచ్చేందుకు చర్యలను ముమ్మరం చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తిరిగి అందుబాటులోకి వచ్చే గ్రామ సీమలు పరిశుభ్రంగా తయారు కావడమే కాకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వీలు కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే రాజంపేట, సుండుపల్లె, కలకడ, పీలేరు, వాయల్పాడు, కురబలకోట ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, గ్రామ కార్యదర్శి, క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్లతో కలిపి శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 439 గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తిరిగి అందుబాటులోకి తెచ్చేందకు చర్యలు చేపట్టడమే కాకుండా 15 టన్నుల వానపాములను కేంద్రాలకు తరలించి ఎరువుల తయారీ చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.



సుండుపల్లె మండలం పాలిమేరపల్లె గ్రామంలో శిథిలావస్థలో చెత్త సేకరణ యంత్రాలు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బృందావనంలా తయారు చేయడమే లక్ష్యం

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను బృందావనంలా తయారు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మండలం నుంచి ఐదు గ్రామ పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అందులో వానపాములను ఏర్పాటు చేసి ఎరువుల తయారీకి చర్యలు చేపడుతున్నాం.ప్రతి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తీగజాతి మొక్కలను అల్లించి అక్కడే గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించే వీలుగా ఒక బృందావనంలా తయారు చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యం. జిల్లాలో 439 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కొనసాగుతన్నాయి. ఉండగా ఇంకా 62 నిర్మాణంలో ఉన్నాయి.

\- మస్తాన్‌వలి,
జిల్లా పంచాయతీ అధికారి

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం పోత్సహకాలు ఇస్తున్నట్లు రైల్వేకోడూరు ఎంపీడీవో నాగార్జునరావు, ఉద్యానశాఖాధికారి బాస్కర్, ఉపాధి ఏపీవో మృత్యుంజేయరావు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఉపాధి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, నేరేడు, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, చింత, పనస, అవకాడో తదితర పండ్ల మొక్కలు పెంపకానికి రాయితీ కోసం అర్హులైన రైతులను గుర్తించి వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. అలాగే పూలు, గడ్డి పెంపకానికి రాయితీ ఉంటుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యా, వ్యవసాయ, ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మండల పరిధిలోని మాధవరం, గొర్లముదివేడు గ్రామాల్లోని ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. సీపీఐ ఎంఎల్/లిబరేషన్ అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యులు రమణ, సుజాత పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ప్రయోజనాల కోసమే

లేబర్ కోడ్లు: సీఐటీయూ

రైల్వేకోడూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లు కార్పొరేటర్ల ప్రయోజనాల కోసమే అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు, అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న వేతనాల చెల్లింపు చట్టం-1936 కనీస వేతనాల చట్టం-1948 బోనస్ చెల్లింపు చట్టం-1965, సమాన పనికి సమాన వేతన చట్టం-1976లో కొన్ని పరిమితులు, లోపాలున్నప్పటికి కార్మికులకు కొన్ని హక్కులు చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం వేజ్‌కోడ్-2019ను తీసుకుని వచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులకు ధరలను బట్టి వేతనాలు కేటాయించాలన్నారు.

వక్ఫ్ చట్టంపై వాల్‌పోస్టర్ విడుదల

రాజంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టం సవరణలో ఉన్న అంశాలపై అవగాహన కలిగేలా వాల్‌పోస్టర్‌ను విడుదల చేసినట్లు బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం 2025లో దేశంలో దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన ముస్లింలు అన్యాయానికి గురవుతున్నారని, వాటిలోని కొన్ని అంశాలను మాత్రమే సరిచేసి వక్ఫ్‌చట్టం మార్పు చేశారన్నారు. అల్లా పేరిట ఇస్తున్న దానాలు ఆ సమాజానికి అందకపోవడం, అవి పక్కదారి పట్టడం వల్ల బడుగు మైనార్టీ ముస్లిం ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ సవరణ బిల్లును ముస్లిం మతపెద్దలు సైతం హర్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వీవీ రమణ, ఎస్సీ నేత గాదెల శ్రీనివాసులు, జీకే నాగరాజు, ఎన్.గిరీష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 ప్రీమియంతో రెండు లక్షల బీమా

రామాపురం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.20 ప్రీమియం పోస్టాఫీస్ బ్యాంకుల్లో కట్టుకుంటే రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఏపీవో పెంచలయ్య తెలిపారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఏడాదికి 20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించినా, వికలాంగులైనా బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీకి 30 చివరి తేదీ

సుండుపల్లె, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ దైవాదీనం సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. రేషన్ డీలర్లు లేదా సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయని వారి పేర్లను తొలగిస్తామని పేర్కొన్నారు.

'25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలి'

సుండుపల్లె, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం సీఆర్‌సీ భవనంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, క్లస్టర్ రీసోర్స్‌పర్సన్లు, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 12(1)సీ ప్రకారం ఆర్థిక స్థోమత లేని వారికి ప్రతి పాఠశాలలో 25 శాతం మందికి ఉచితంగా విద్యను అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

'ఎమ్మెల్యే శ్రీధర్‌ను కుల అహంకారంతో మాట్లాడితే సహించం'


మాట్లాడుతున్న దళిత నాయకులు

రైల్వేకోడూరు,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను కుల అహంకారంతో మాట్లాడితే సహించేది లేదని జనసేన పార్టీ దళిత నాయకులు బీదం నవీన్‌కుమార్, కనుపర్తి శంకరయ్య, సింగమాల రామ్మూర్తి హెచ్చరించారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్‌ను ఉద్దేశించి చంద్రబాబునాయుడి పుట్టిన రోజున కొందరు నాయకులు పనికట్టుకుని మాట్లాడడం సబబుకాదన్నారు. ఒక ప్రజాప్రతినిధిపై కించపరుస్తూ మాట్లాడడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు.ఎమ్మెల్యే శ్రీధర్ ఇంజినీరింగ్ పట్టభద్రుడని గుర్తు చేశారు. జనసేన దళిత నాయకులు పాణ్యం మణి, లింగం నరేష్, పొగడతొట్టి హరిబాబు, పల్లాల పరుశురాం, గోదా వివేకానంద, సిరియాల శివకుమార్, కనుపర్తి వంశి, సింగమాల శివశంకర్, తిప్పన నరసింహ, కొరముట్ల బన్ని పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు

గాలివీడు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): గాలివీడు బస్టాండు వద్ద పెద్దూరు మార్గంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీటిని సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్ ఆధ్వర్యంలో తొలగించారు. ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పొంగిపొర్లిన మురుగుకాలువ నీరు రహదారి వెంబడి ప్రవహించడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి పంచాయతీ సిబ్బందితో కలిసి మురుగునీటిని పూర్తిగా తొలగించారు. దీంతో గ్రామస్థులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

చెట్లను నరికితే ఊరుకోం

నందలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నీడనిస్తున్న చెట్లను నరికితే ఊరుకోమని పాటూరు గ్రామ పంచాయతీ ఎర్రిపాపాయగారిపల్లె శివరాంపురం గ్రామస్థులు హెచ్చరించారు. గ్రామస్థులు మాట్లాడుతూ విద్యుత్‌లైను ఏర్పాటు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ప్రోత్సహిస్తుంటే దాదాపు 50 సంవత్సరాల వయస్సు కలిగిన చెట్లను నరకడం ఏమిటన్నారు. విద్యుత్‌లైను చెట్ల మధ్య నుంచి కాకుండా వేరే మార్గంలో వేసుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయాధికారిణి మల్లిక అన్నారు. బాలిరెడ్డిపల్లె, వై.కోట గ్రామ పంచాయతీల పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న రైతులకు జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంసీఏ బుల్లయ్య, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రామయ్య, మోడల్ మేకర్ తిరుపాలమ్మ, వీఆర్వో లక్ష్మయ్య, ఎన్ఎస్ఏ భార్గవ, పంచాయతీ కార్యదర్శి ఎన్.బిందు, రైతు నరసింహారెడ్డి, ఐసీఆర్ పి.రత్నమ్మ, గురువులు, రైతులు హాజరయ్యారు.

కువైత్‌లో సీఎం జన్మదిన వేడుకలు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను కువైత్‌లో ప్రవాస భారతీయులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి కువైత్‌లోని హవల్లీలో ఎన్ఆర్ఐ, టీడీపీ సభ్యుడు కంచన రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ, జనసేన నేతలు మనుబోతు సహదేవ, గోవిందు, ఆనంద్, సాయి, నాగరాజు, నాగేష్, గుగ్గిళ్ల నాగార్జున, బ్రహ్మయ్య, బలరాం, మల్లికార్జున, మూర్తి, మధుసూదన్, విశ్వేశ్వర తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయండి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సోమవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహం సమీపంలో కార్మిక సంఘం నేతలు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్ర మాట్లాడుతూ పట్టణంలో నిర్వహించే ర్యాలీలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు.జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్‌హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్, వెంకటయ్య, జయరాం పాల్గొన్నారు.

'మాన్యం భూముల వేలం నిర్వహిస్తాం'


వరదరాజులస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఈవీవో కొండారెడ్డి

చిట్వేలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్వేలిలో వెలసిన సోమేశ్వర, వీరభద్రాలయం, వరదరాజులు, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములను ఆరు సంవత్సరాల కాలపరిమితితో వేలం పాట నిర్వహిస్తామని రాజంపేట గ్రూపు దేవాలయాల ఈవీవో కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన గ్రామంలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వరదరాజస్వామి, భద్రకాళి వీరభద్ర స్వామి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వేసిన వేలంపాటను రద్దు చేశామన్నారు. పది రోజుల తర్వాత దండోరా వేయించి కొత్త వేలం పాటను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరవింద్ సురేంద్ర, పవన్‌శర్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


వీఆర్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత అన్నారు.సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

పలుశాఖల అధికారులు డుమ్మా...

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు, అగ్రికల్చర్ సిబ్బంది, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మినహా ఇతర శాఖాధికారులు హాజరు కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పైపుల లీకేజీని అరికట్టండి


పెనగలూరు దళితవాడలో పైపులైను లీకేజీ వల్ల వృథా అవుతున్న తాగునీరు

పెనగలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెనగలూరు అరుంధతివాడలో తాగునీటి పైపులైన్‌లో తరచూ ఏర్పడే లీకేజీని శాశ్వత ప్రాతిపదికన అరికట్టాలని సోమవారం అరుంధతివాడ ప్రజలు ఎంపీడీవో విజయరావును కోరారు. ఈ సందర్భంగా ఆయన దళితులకు హామీ ఇస్తూ పైపులైన్లలో ఏర్పడే అంతరాయాన్ని శాశ్వతంగా నివారించి గట్టి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఈ పైపులైనులో అడ్డదిడ్డంగా ఇళ్లల్లోకి కనెక్షన్‌లు తీసుకున్నందువల్ల ఇలా రెండు మూడు రోజులకోసారి లీకేజీ ఏర్పడి ఎగువకొత్తపల్లిలోని రెండు వీధులు నిత్యం జలమయంగా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. లీకేజీ నీటివల్ల రోడ్లు పాచిపెట్టి పాదచారులు జారి పడుతున్నారని ఈ సందర్భంగా విలేకరులతో తెలిపారు. పైపులు పూర్తిగా వేసి లీకేజీ లేకుండా చూడాలని కోరుతున్నారు.

పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలకు శ్రీకారం

సంబేపల్లె, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు శ్రీకారం చుట్టామని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సమీప ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6లోకి ప్రవేశం కల్పించే కార్యక్రమాన్ని సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి నూతన తరగతిలో కూర్చోబెట్టామన్నారు.

నేడు భూముల రీసర్వేపై గ్రామసభ

రామాపురం, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపగుడిపల్లెలో మంగళవారం ఉదయం 10 గంటలకు భూముల రీసర్వేపై అవగాహన కల్పించేందుకు రైతులతో గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. సర్వే బృందం ఒక్కో బ్లాకుగా విభజించుకుని షెడ్యూల్‌ను తయారు చేసుకుని పారదర్శకంగా రీసర్వే చేపడతారన్నారు.

మామిడి రైతులకు సాయం అందిస్తాం


రాలిపోయిన మామిడి కాయలను పరిశీలిస్తున్న మదన్‌మోహన్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): గాలివానకు నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం రెడ్డివారిపల్లె, వీరనాగిరెడ్డిగారిపల్లె, దప్పేపల్లె, వీరారెడ్డిగారిపల్లె, గల్లావాండ్లపల్లె గ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. నష్టాన్ని అంచనా వేయించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని ఆయన అధికారులను కోరారు.

దోమల నివారణకు చర్యలు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని జ్యోతి, గొల్లపల్లె, పి.కొత్తపల్లె, చలమారెడ్డిపల్లె, కొట్టాలు, వెంకటాయపల్లె గ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో దోమల నివారణకు సోమవారం ఏసీఎం కెమికల్ పిచికారీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు నాగరత్నమ్మ, షాహీన, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 155 మంది హాజరు

పెనగలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం పాఠశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రవేశ పరీక్షకు 155 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సీ తెలిపారు. 160 మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. మెరిట్ మార్కులు, రిజర్వేషన్ వివరాలు డీఈవో కార్యాలయం ద్వారా పాఠశాలకు అందుతాయన్నారు.

పేద కుటుంబానికి సాయం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాళ్లచెరువుపల్లె సమీపంలో పంట పొలాలకు కాపలా ఉంటూ జీవనాధారం పొందుతున్న కుటుంబానికి సోమవారం జీవనజ్యోతి ఆనందనిలయం ఆశ్రమం చైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం రూ.2 వేల ఆర్థిక సహాయం అందించారు. నిరాశ్రయులైన ఇలాంటి కుటుంబాలకు దాతలు, ప్రభుత్వం అండగా ఉండాలని సుబ్రమణ్యం కోరారు.

ఉద్యాన రైతు విల..విల...

- దోస, కర్బూజ, టమోటా, వంగ ధరలు పతనం
- బయటి రాష్ట్రాల్లో తగ్గిన డిమాండ్
- కుప్పకూలిన ధరలు
- తీవ్ర నష్టాలతో అప్పుల్లో అన్నదాతలు

టమోటా రైతుకు కన్నీరే మిగిలింది...


సొంపల్లె సమీపంలో పొలంలోనే వదిలేసిన టమోటాలు

టమోటా ధరలు నాలుగున్నర నెలలుగా కుప్పకూలడంతో రైతులు అల్లాడిపోతున్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా సాగవుతుంది. ఈ ప్రాంతంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా సాగైంది. నాలుగున్నర నెలల క్రితం ఆశాజనకంగా ఉన్న టమోటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలి పాతాళానికి చేరాయి. అప్పటి నుంచి టమోటా రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో టమోటా రైతులు కుమిలిపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. నాలుగున్నర నెలలుగా 23 కేజీల బాక్సు కేవలం రూ.50 నుంచి రూ.200లోపే పలుకుతోంది. దీంతో టమోటా రైతులకు తీవ్ర నష్టం చేకూరింది.

దోస కాయలు అడిగేవారు కరువయ్యారు



ఏడు ఎకరాల్లో దోస పంట సాగు చేశా. దీనికి గానూ రూ.12 లక్షలు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. తోట దగ్గరకు వచ్చి కేజీ రూ.4నుంచి రూ.5కు అడుగుతున్నారు. మొదటి కోతకు రూ.3 లక్షలు వచ్చింది. అంతే తరువాత దోస అడిగే వారు లేరు. దీంతో కాయలు తోటలోనే వదిలేశాను. పెట్టుబడి కూడా రాలేదు. దోస పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను.

- వెంకటరమణారెడ్డి, దోస రైతు, వేపూరికోట

రూ.18 నుంచి రూ.5కు పడిపోయిన కర్బూజ


వేపూరికోట వద్ద కోయకుండా వదిలేసిన కర్బూజ కాయలు

కర్బూజ పంట కూడా రైతులకు కన్నీళ్లు మిగిల్చుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పుడు ధరల రూపంలో మరో కష్టం వచ్చి పడింది. నెల రోజులకు ముందే భారీగా దిగుబడి వచ్చిన కర్బూజ రైతులకు వైరస్ రూపంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో పంట అధికంగా సాగు కావడం, దిగుబడి బాగా వస్తుండడంతో ఇక్కడ డిమాండ్ పడిపోయింది. దీంతో ధరలు పతనమయ్యాయి. నెల రోజులకు ముందు కేజీ రూ.18 పలికిన ధర ఇప్పుడు రూ.5కు చేరింది. దీంతో అడిగేవారు లేక రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

ములకలచెరువు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా నాలుగు పంటల ధరలు పతనమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు కుమిలిపోతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలకు ధరల రూపంలో వచ్చిన కష్టం రైతులను ముంచింది. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు పాతాళానికి చేరడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక విలవిలలాడుతున్నాడు. ధరలు లేక ఏం చేయలేక చేతికొచ్చిన పంటలను కోత విధించకుండా పొలాల్లోనే వదిలి వేయాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా ధరలు లేక పొలాల్లోనే వదిలేసిన దోస, టమోటాలు, కర్బూజ, వంకాయలు దర్శనమిస్తున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో వేలాది ఎకరాల్లో టమోటా, దోస, కర్బూజ, వంగ పంటలు సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం సాగైన పంటల్లో దిగుబడి వస్తోంది. దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి.

టమోటా పంట ముంచింది



టమోటా పంట వరుసగా సాగు చేయడంతో నష్టాలే మిగిలాయి. ధర ఉంటుందేమోనన్న ఆశతో ప్రస్తుతం ఆరు ఎకరాల్లో టమోటా సాగు చేశా. దీనికి గాను రూ.10 లక్షలు ఖర్చు వచ్చింది. టమోటా ధరలు కుప్పకూలడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనపడడం లేదు. గతంలో కూడా చేసి ధర లేకపోవడంతో నష్టపోయాను.

-మల్లికార్జునరెడ్డి, టమోటా రైతు, పర్తికోట

పాతాళానికి పడిపోయిన దోస ధరలు


వేపూరికోట సమీపంలో పొలంలోనే దోస కాయలు

దోస ధరలు పాతాళానికి చేరుకోవడంతో రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. దోస సాగు చేసిన రైతులను ధరలు నట్టేట ముంచాయి. 15 రోజుల క్రితం వరకు కేజీ రూ.20 పలికిన దోస ధర పతనమై రూ.5కి చేరింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 300 ఎకరాలకుపైగా దోస పంట సాగు చేశారు. ఇక్కడ పండిన దోస ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని పలు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్న రాష్ట్రాల్లో ప్రస్తుతం దోస పంట అధికంగా సాగై దిగుబడి భారీగా వస్తుండడంతో ఇక్కడి దోస ధరలు కుప్పకూలాయి.

వంగ సాగు చేసి తీవ్రంగా నష్టపోయా



భూమిని కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వంగ పంట సాగు చేశా. దీనికి గానూ రూ.4.50 లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. పంట దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి. కాయలు కోత విధిస్తే కూలీ ఖర్చు కూడా రావడం లేదు. చేసేది లేక కాయలు కోయకుండా పొలంలోనే వదిలేశా. దీంతో వదిలేసిన వంకాయలు కళ్లేదుటే ఎండిపోతుండడంతో మనసు కలచివేస్తోంది.

- బాలాజీ, వంగ రైతు, గురికివారిపల్లె

రూ.25 నుంచి 10కి పడిపోయిన వంగ ధర


పెద్దపాళ్యం సమీపంలో వదిలేసిన వంకాయలు

వంగ ధర కూడా పతనమైంది. నెల రోజుల క్రితం వరకు రూ.25 పలికిన కేజీ ధర క్రమంగా తగ్గుతూ రూ.10కి పడిపోయింది. నిన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న వంగ ధరలు కుప్పకూలాయి. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రైతులు సుమారు 500 ఎకరాలకుపైగా సాగు చేశారు.
వ్యాపారులు రైతుల పొలాల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తమిళనాడు రాష్ట్రంలో కూడా వంగ పంట అధికంగా సాగు కావడంతో ఇక్కడ ధరలు సగానికి పడిపోయాయి.

చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారు

- ప్రభుత్వ విప్‌కు బాధితుల ఫిర్యాదు


శాసనమండలి విప్ హరిప్రసాద్‌కు గోడు విన్నవించుకుంటున్న పొన్నేటిపాళెం వాసులు

మదనపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో వేటగాళ్ల ఉచ్చులో చిరుత మృతి చెందితే అటవీ శాఖాధికారులు అమాయక రైతులపై అక్రమ కేసులు బనాయించారని బాధితుల కుటుంబీకులు శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి రాయలసీమ కో-ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి, జనసేన సంయుక్త కార్యదర్శి షైపోర్స్ మహేష్ వెంట పొన్నేటిపాళెం గ్రామస్థులు వెళ్లారు.

ఈ సందర్భంగా హరిప్రసాద్‌తో రాందాస్‌చౌదరి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందితే అడవి పక్కన ఉన్న భూమికి చెందిన రైతులను చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా విచారణ పేరుతో పిలిపించి అరెస్టు చేసి రిమాండుకు పంపారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి బాధితుల గోడు తీసుకెళ్లి అక్రమ అరెస్టులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దీనిపై హరిప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితుల విన్నపాలను వినిపించారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని రాందాస్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో పొన్నేటిపాళెం గ్రామస్థులు సుబ్బరామిరెడ్డి, శ్రావణి, సురేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుమలత, చంద్రకళ, భార్గవి, శ్రీనివాసులు, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్ వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూ చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన 'మా ఇష్టం తోలేస్తాం' అన్న కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం మళ్లీ ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కాగా పోలీసుల సమాచారం తెలియడంతో ఆ ప్రాంతం నుంచి మరో రెండు ట్రాక్టర్లు ఉడాయించినట్లు సమాచారం. దీనిపై స్థానిక తహసీల్దార్ పామిలేటి మాట్లాడుతూ రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణాను ఇకపై ఉపేక్షించేది లేదని మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో కూడా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రిజర్వాయర్ ప్రాంతంలో గట్టి నిఘా పెట్టి ఇసుకాసురుల ఆటలు కట్టించాలని లేనిపక్షంలో పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ రేణుక



వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మాల్యం రేణుకను నియమిస్తూ ఎస్వీయూ వైస్ చాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారు. 21 సంవత్సరాలుగా అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ రేణుక ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వాల్మీకిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ జె.కృష్ణమూర్తి, సహచర అధ్యాపకులు, హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. 2004 ఏప్రిల్‌లో మదనపల్లె బీటీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులలో చేరిన ఆమె అనేక పరిశోధనలు చేయడంతో డాక్టరేట్ ఇచ్చారు. 2004 నుంచి 2021 ఆగస్టు వరకు మదనపల్లె బీటీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహించిన రేణుకను అనంతరం వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు.

భూమి విషయమై ఘర్షణ : ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.రాజంపేట గ్రామం బీసీ కాలనీలో ఆదివారం రాత్రి భూవివాదమై అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్‌ఐ మహ్మద్‌రఫీ కథనం మేరకు... తంగా క్రిష్టయ్య, తంగా గోపాల్ అనే ఇరువురు అన్నదమ్ములకు పెద్దలు సంపాదించిన భూమి 6 ఎకరాలు ఉంది. ఆ భూమి వారిద్దరికీ భాగపరిష్కారాల నిమిత్తం ఆదివారం అన్న క్రిష్టయ్య వద్దకు వెళ్లగా క్రిష్టయ్య వారిపై కర్రతో దాడి చేయగా గోపాల్, విష్ణు, క్రిష్టవేణి తలకు బలమైన గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్రిష్టయ్య, యల్లమ్మ, పెంచలమ్మ, గంగాదేవి, కళావతి, సాయి, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : ఏఎస్పీ


సమస్యలను తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్ణిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల మధ్య ఘర్షణ


విద్యార్థులను చెదరగొడుతున్న సీఐ కుళాయప్ప, సిబ్బంది

రాజంపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లెలో ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మన్నూరు సీఐ కుళాయప్ప తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థుల గుంపులను చెదరగొట్టారు. ఘర్షణకు కారకులైన ఐదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువురిపై కొడవలితో దాడి


దాడిలో గాయపడిన లక్ష్మీదేవి, రామక్రిష్ణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటారుకు విద్యుత్ వైరు తగిలించే విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో రేపన ప్రభాకర్ అనే వ్యక్తి ఇరువురిపై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరచాడు. రాయచోటి అర్బన్ పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం మాధవరం వడ్డెపల్లిలో రేపన లక్ష్మీదేవి తన వ్యవసాయ పొలంలో మోటారుకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన రేపన ప్రభాకర్ అనే వ్యక్తి లక్ష్మీదేవికి సంబంధించిన వ్యవసాయ మోటారు విద్యుత్ కనెక్షన్‌కు అక్రమంగా వైరు తగిలించేందుకు ప్రయత్నించగా ఆమె అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన రేపన ప్రభాకర్ తన వద్ద ఉన్న కొడవలితో ఆమెపై దాడి చేశాడు. పక్కనే ఉన్న ఆమె మేనమామ రామక్రిష్ణ అడ్డుకోవడంతో అతనిపై కూడా దాడి చేసి గాయపరిచాడు. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు


దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఆమె పర్యటించి పలు దుకాణాలను తనిఖీ చేశారు. దాదాపు అన్ని దుకాణాలు, హోటళ్లు, పండ్ల వ్యాపారులు, కిరాణా స్టోర్‌లలో డిస్పోబుల్ గ్లాసులు, కప్పులు, కవర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమలులో ఉందని వాటిని వాడటానికి వీలు లేదన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఎన్నోసార్లు అధికారులు అవగాహనా కార్యక్రమాలు, ప్రచారాలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ కవర్ల అమ్మకం, వినియోగం పూర్తిగా ఆపివేసి ప్రత్యామ్నాయ మార్గాలు పాటించాలని ఆమె ప్రజలను కోరారు. నిబంధనలు పాటించకుండా బేఖాతరు చేసిన వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఏవో రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఖురాన్ పండితుడు మృతి



కలికిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలికిరికి చెందిన ఖురాన్ పండితుడు, ముస్లిం మత ప్రచారకుడు ఖారీ సుహేల్ సాహెబ్ (35) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని ఒక మదరసాలో ప్రధాన గురువుగా పనిచేస్తున్న సుహేల్ అక్కడ ప్రసంగాలు చేయడానికి వెళుతుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో తీవ్రగా గాయపడ్డాడు. పలమనేరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుహేల్ స్వగ్రామం కలికిరి పంచాయతీలోని రాజువారిపల్లె. సుహేల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం రాత్రి పలమనేరు మదరసా ఆవరణలోనే సుహేల్ అంత్యక్రియలు నిర్వహించారు.

రైల్వేకోడూరులో యువకుడు...


మృతి చెందిన చరణ్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ నవీన్ బాబు వివరాల మేరకు... చియ్యవరం పంచాయతీ నడింపల్లికి చెందిన చరణ్(28) బైకుపై వెళుతుండగా అదుపుతప్పి శాంతినగర్ వద్ద ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంలో తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు. అతివేగం లేదా అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ జ్ఞానేంద్రప్రసాద్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. కలికిరి పట్టణానికి చెందిన జ్ఞానేంద్రప్రసాద్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా సొంతూరైన కలికిరిలోనే ఉంటున్నారు. మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన సోమవారం తన ద్విచక్రవాహనంలో కలికిరికి వెళుతుండగా మండలంలోని చెరకువారిపల్లె వద్ద బొలెరో లగేజీ వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్ఞానేంద్రప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి వాహనం కోసం గాలింపు చేపట్టారు.

దారి దోపిడీ కేసులో దొంగ అరెస్ట్


దొంగ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెనగలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం చక్రంపేట వద్ద 2023 మార్చి 8వ తేదీ అర్ధరాత్రి జరిగిన దారి దోపిడీ కేసులో నిందితుడిగా ఉన్న కందుల బాలవర్ధన్‌నాయుడిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్‌ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పెనగలూరు దళితవాడకు చెందిన మీసాల నవీన్‌కుమార్ ఇంటికి వస్తుండగా సాయివికాస్ పాఠశాల సమీపంలో స్పీడు బ్రేకరు వద్ద వేచి ఉన్న టి.పెంచలయ్య అలియాస్ చిన్న, కె.బాలవర్ధన్‌నాయుడు అలియాస్ బాలు కలిసి నవీన్ కుమార్‌కు కత్తితో బెదిరించి రూ.5 వేలు దోపిడీ చేశారు. బాలవర్ధన్ పరారీలో ఉండి 10 రోజుల కిందట సొంతూరు చక్రంపేటకు రాగా అతడి కోసం గాలిస్తున్న పెనగలూరు పోలీసులు ముద్రపల్లె క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వల్లి, కానిస్టేబుళ్లు రవిశంకర్, హరిబాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిద్దవటం పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం పెన్నానది వంతెన సమీపంలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ వృద్ధురాలిని సోమవారం పోలీసులు కాపాడి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహ్మద్ రఫీ మాట్లాడుతూ లోలెవల్ వంతెన సమీపంలో ఓ వృద్ధురాలు పెన్నానదిలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్లు గ్రామస్థులు సమాచారం తెలపడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కాపాడి పరమాత్మసేవా ఆశ్రమంలో ఉంచామన్నారు. ఎవరైనా ఆమెను గుర్తిస్తే 9121100581, 9121100584 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తులను లీజుకిచ్చే ప్రతిపాదనలు తగవు

● కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు చట్టం కాకముందే కేంద్ర ప్రభుత్వం లీజు పేరుతో కార్పొరేట్లకు దాదాపు 99 సంవత్సరాలకు లీజు కిచ్చే ప్రతిపాదనలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి అన్నారు. అణగారిన వర్గాల రక్షణ, రాజ్యాంగ హక్కులను కాలరాయడమే ధ్యేయంగా కేంద్రంలోని మోడీసర్కార్ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం, రాజ్యాంగ బద్ధత సవాళ్లు అనే అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు ముస్లిం ప్రజల ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా పాలన సాగిస్తోందన్నారు. ఆ కోవలో గత 2014 సంవత్సరం నుండే అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వాల రాష్ట్ర ముఖ్యమంత్రులు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చట్టం కాకముందే వేలాది ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపుల పర్వానికి శ్రీకారం చుట్టడం సరి కాదన్నారు. సుమారు 1000 సంవత్సరాల క్రితం దేశాన్ని పాలించిన నవాబులు దాతృత్వంతో ఇచ్చిన ఆస్తులకు దస్తావేజులు లేవన్నారు. అలాంటి వాటిని బై యూజర్ పేరిట స్వాధీనం చేసుకునేందుకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లు చట్టం కాకముందే 52 బడా కార్పోరేట్ పెట్టుబడిదారులకు 99 సంవత్సరాలకు లీజు పేరుతో ప్రధాన నగరాలలోని విలువైన స్థలాలు, భవంతులు ఇవ్వడానికి ముందస్తుగా ప్రతిపాదనలు తయారు చేసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, డబ్బ్యు రాము, ఓబయ్య, సగిలి గుర్రప్ప, బాబు భాయ్, డాక్టర్ గోపాల్, దేవర శ్రీకృష్ణ, పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందంగా కట్టి వదిలేశారు...

● నిరుపయోగంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్‌లు

● ప్రభుత్వ ధనం వృథా ● పట్టించుకోని పాలకులు

ముద్దనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. నిర్మాణాలూ మొదలు పెట్టారు. చాలా వరకు పూర్తయ్యాయి. అయితే చాలా చోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అసంపూర్తిగా, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగానూ మారుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలను 12 సచివాలయ కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. అన్ని చోట్లా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ నాయకులకే సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణ పనులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలోనే భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

బిల్లులు చెల్లించకపోవడంతో అరకొర పనులు పెండింగ్‌లో పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ నూతన భవనాలు ప్రారంభించారు. ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్న కొన్నింటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. యామవరంలో ఆర్బీకే, ముద్దనూరు 1, 2 సచివాలయం, ఆర్బీకే, శెట్టివారిపల్లెలో సచివాలయం, ఆర్బీకే, తిమ్మాపురం సచివాలయం, ఆర్బీకే, కొలవలి, సచివాలయం, పెనికెలపాడు సచివాలయం, ఆర్బీకే భవనాలకు సంబంధించి అరకొర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు సంవత్సరాలుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. కేవలం వైసీపీ ప్రభుత్వంలో నిధులు చెల్లించక పోవడంతోనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలో నైనా అవి శిథిలావస్థకు చేరుకోక ముందే ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ మునికుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మండలంలో కొన్ని సచివాలయాలు, ఆర్బీకే నూతన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి అప్పగిస్తే బిల్లులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.



ప్రారంభానికి నోచుకోని ముద్దనూరు సచివాలయం, ఆర్బీకే భవనం



శెట్టివారిపల్లెలో ప్రారంభం కాని సచివాలయం



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన శెట్టివారిపల్లె ఆర్బీకే భవనం

ఉత్సాహంగా సాగిన బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభరాజములు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఒంగోలుజాతి వృషభరాజముల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం 11వ రోజు స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అశ్వవాహనంపై స్వామివారిని ఆశీలను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన బంటుపల్లి గోపాల్‌యాదవ్‌కు చెందని ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రూ.100116 అందుకున్నారు. అనంతపురం జిల్లా మేడిమాకుపల్లెకు చెందిన తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయస్థానంలో నిలిచి రూ.75,116, రామేశ్వరానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు తృతీయస్థానంలో నిలిచి రూ.50,116 గెలుపొంది నగదు బహుమతులు అందుకున్నారు. బండలాగుడు పోటీలు సందర్భంగా రామేశ్వరం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మైదుకూరులో రసవత్తరంగా...



మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు నగదు అందజేస్తున్న కశెట్టి కిరణ్‌కుమార్

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో అంకాలమ్మతల్లి తిరుణాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలకు చెందిన బోరెడ్డి వీరనరసింహారెడ్డి, సుంకి సురేంద్రరెడ్డిల ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.1,50,000లను అందుకున్నారు. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేశ్ యాదవ్ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.1,00,000, సిరివెళ్ల మండలం గుండ్రమాన్‌దిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.75వేలు, నంద్యాల జిల్లా పెసరవాయికు చెందిన సయ్యద్ కలాంబాషా ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ.50వేలు, ఖాజీపేట మండలం పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య, బోలా వెంకటయ్యలకు చెందిన ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.30వేలు బహుమతి సాధించాయి. కార్యక్రమంలో లక్ష్మి బిల్డర్స్ అధినేత కశెట్టి కిరణ్‌కుమార్, కశెట్టి నర సింహులు, కశెట్టి రవికుమార్, కొమ్మురి సురేష్‌బాబు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఓ ఇంటిలో జరిగిన బంగారు నగల చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీలో మార్చి 24వ తేదీ కరపాకుల సుజాత భర్త చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటిలో పూజల పేరుతో పది తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి సీసీ ఫుటేజీ ద్వారా నిందితుల సమాచారం తెలుసుకున్నారన్నారు.

కర్నూలు జిల్లా సిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన కనకమ్మ, ముదిర్నే శ్రీనివాసులు ప్రస్తుతం ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో ఉండేవారు. వీరు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు వెళ్లి వారి ఇళ్లలో, అనారోగ్య సమస్యలను పూజలు చేసి నయం చేస్తామని మాయమాటలు చెప్పేవారు. పూజలు చేసే సమయంలో బంగారు లేక వెండి వస్తువులు ఉంచితే మంచి ఫలితం వస్తుందని మోసపూరిత మాటలు చెప్పి ఆభరణాలు చోరీ చేసేవారు. వీరిపై నిఘా పెట్టి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసును చేధించిన సీఐ, ఎస్ఐలతో పాటు పోలీసులు హైమావతి, దేవదాసు, రియాజ్, నాగేంద్రలను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొరిచెరువు వద్ద రవికుమార్ (45) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ చెట్టుకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రవికుమార్ గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురం వాసి. మంచాలకు వైర్లు అల్లుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో మంచాలకు వైర్లు అల్లుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా గాలివాన బీభత్సానికి ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. ఈ విషయాన్ని పశువుల కాపరులు గుర్తించి తమకు సమాచారం అందించారని ఎస్ఐ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

చిలమకూరు అల్ట్రాటెక్ మైన్స్ టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లను జడ్పీ హైస్కూల్ మైదానంలో ఉంచిన దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిలమకూరులోని అల్ట్రాటెక్ మైన్స్ నుంచి ఫ్యాక్టరీలోకి సున్నపురాయిని రవాణా చేస్తున్న 5 టిప్పర్లను ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు సోమవారం సీజ్ చేశారు. నిబంధనలకు మించి ఓవర్‌లోడ్‌తో వెళుతున్న దృష్ట్యా టిప్పర్లను సీజ్ చేసి.. రవాణాశాఖా అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా, ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి మధ్య వివాదం నడుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిప్పర్లను సీజ్ చేయడంతో స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో ప్లాంటు వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

17 మందిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. భార్య, భర్తల పంచాయతీ విషయంపై ఈ ఘర్షణ చోటు చేసుకోగా ఇరువర్గాలకు చెందిన మున్వర్, బాదుల్లా, నందిపల్లె వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డితో పాటు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీలు అందుకుంటున్న తేజోమయి, లక్ష్మీమనుశ్రీ

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో ఈనెల 20న జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ ప్రతిభ కనబరచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. అండర్-15, అండర్-11 బాలికల విభాగంలో తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ 5వ స్థానం సాధించి ట్రోఫీలు అందుకున్నారని.. ఈ టోర్నమెంట్‌లో 266 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడి మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధికి చెందిన వృద్ధుడు అనారోగ్యంతో మనస్థాపం చెంది సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కోటవీధికి చెందిన కృష్ణయ్య కుమారుడు చెన్నయ్య (85) ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్థాపంతో వృద్ధుడి మృతి



మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాలీకి తెచ్చుకున్న గొర్రెలు చనిపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం వృద్ధుడు పురుగులమందు తాగి మృతి చెందాడు. ఆస్పత్రి అవుట్ పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలం ముద్దలదొడ్డిగ్రామం ఆవుల వారిపల్లెకు చెందిన రామచంద్ర (60) పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండటంతో కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తంబళ్లపల్లె పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాలలో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

● నీళ్లు అనుకుని విషద్రావణం తాగిన మహిళ ● తప్పుడు కేసులు పెడతారనే భయంతో యువకుడు ● కుటుంబ కలహాలతో ఒకరు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల నుంచి పలు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన అనిల్ భార్య లక్ష్మి(23) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉన్న విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అలాగే పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన శోభారాణి (50) సోమవారం ఉదయం గొర్రెలను మేపుకోవడానికి వెళ్లి ఇంటికి వచ్చింది. దాహంగా ఉండటంతో తాగునీటి చెంబులో ఉన్న విషద్రావణంను పొరపాటున తాగేసింది. వెంటనే కులుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కురబల కోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ కోనంగి వారిపల్లెకు చెందిన ఆనంద్ కుమారుడు పి.శ్రీనివాసులు (25) వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. అయితే తమ కూతురిని మరొక యువకుడికి దగ్గర చేస్తున్నాడనే అనుమానంతో ముదివేడు పోలీసుస్టేషన్‌కు అదే గ్రామానికి చెందిన జ్యోతి, మోహన పిలపించారని ఆందోళన చెందాడు. ఈ క్రమంలో సోమవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందు తున్నాడు.



నీళ్లు అనుకుని విషద్రావణం తాగిన మహిళ, తప్పుడు కేసులు పెడతారనే భయంతో పురుగుమందు తాగిన యువకుడు

పీలేరు రీ-సర్వే డీటీగా ప్రసాద్



పీలేరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రీ-సర్వే కార్యక్రమం పీలేరు డిప్యూటీ తహసీల్దారుగా ఎం.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాయచోటిలో పనిచేసిన ప్రసాద్ డిప్యుటేషన్‌పై పీలేరుకు వచ్చారు. పీలేరులో డీటీగా పనిచేసిన సుబ్రహ్మణ్యం రాయచోటికి వెళ్లారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిగా నవీన్‌కుమార్‌రెడ్డి



ములకలచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మార్కెట్ కమిటీ కార్యదర్శిగా నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి మార్కెట్ కమిటీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉండడంతో శ్రీ సత్యసాయి జిల్లా కదిరి కార్యదర్శి జగదీష్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

మానవతా అంబులెన్స్ డ్రైవర్ మృతి

వాల్మీకిపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ అంబులెన్స్ డ్రైవర్ గంగాధర్ (37) మృతి చెందారు. వాల్మీకిపురం మండలంలోని ఎస్టీఆర్ కాలనీకి చెందిన గంగాధర్ స్థానిక మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆయన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి సభ్యులతో కలిసి నివాళులర్పించి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామకృష్టారెడ్డి, పీవీ నారాయణ, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లికి చెందిన టి.గోపాల్ తన ఇంటిలో 20బీర్లు, 17 మద్యం బాటిళ్లు, 2బీజర్లు పెట్టుకుని అధిక రేటుకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎంపీడీవో శివశంకర్

పీలేరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, చేతిపంపుల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్‌హెడ్ ట్యాంకులలో క్లోరినేషన్ చేయించాలన్నారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ లతీఫ్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు ఎక్కువగా వుండడంతో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి తెలిపారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో వడదెబ్బ, కుష్ఠు, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రతను బట్టి ప్రజలు బయటకు రాకూడదని, అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు రావాలన్నారు. బయటకు వెళ్లేవారు తమ వెంట తప్పనిసరిగా గొడుగు, చేతిరుమాలు, నీళ్ల బాటిల్, టోపీ వంటివి ఉపయోగించాలన్నారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలిపి తాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ శోభాయాత్ర

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పట్టణంలో అంబేడ్కర్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో విశేషంగా అంబేడ్కర్ విగ్రహానికి అలంకరణ చేసి ఊరేగింపుగా పుంగనూరు రోడ్డులోని ఏడీఎస్ నుంచి చిత్తూరు బస్టాండ్ టౌన్ బ్యాంక్ సర్కిల్, సీటీఎం రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ బహుజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించిన ప్రపంచమేధావి అన్నారు. నిమ్న వర్గాల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కోన భాస్కర, ఉదయ్, డీకే నారాయణ, లక్ష్మీపతి, ప్రదీప్, రమేష్, మను, ప్రసాద్, ప్రశాంత్, రీయాజ్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలుపుతున్న చర్చి పాస్టర్లు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చర్చి పాస్టర్లకు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గంలోని చర్చి పాస్టర్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని చర్చి పాస్టర్లకు కూటమిప్రభుత్వం ఒక్కొక్కరికి నెలకు రూ.5వేల చొప్పున ఏడు నెలల గౌరవ వేతనాన్ని గుడ్‌ఫ్రైడే సందర్భంగా విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు బోనాసి జాన్‌బాబు, జయకుమార్, దేవకుమార్, దేవమణి, శామ్యూల్, దివాకర్, సాంసన్ జోసెఫ్, పద్మరేచల్, ప్రేమమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

మదనపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువగా తాగునీటి సమస్యలు, వీధి లైట్లపై వినతులు వస్తున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే గొల్లపల్లె వంక కబ్జా

● సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



గొల్లపల్లె వంక కబ్జాపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కోళ్లవారిపల్లె గ్రామస్థులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద జాతీయ రహదారి పక్కన వున్న వంకను రాత్రికి రాత్రే కబ్జా చేసి పూడ్చివేశారని కోళ్లవారిపల్లె గ్రామస్థులు సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ డివిజన్ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోళ్లవారిపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ బార్లపల్లె వద్ద సర్వే నెంబర్ 221లో 40 అడుగుల వెడల్పుతో గొల్లపల్లె వంక, 20 అడుగుల వెడల్పుతో దారి వుందన్నారు. గతంలో కొందరు ఈ వంకను కబ్జా చేసేందుకు వస్తే తాము అడ్డుకున్నామన్నారు. కానీ ఆదివారం ఉదయం నుంచి గూండాలను పిలుచుకొచ్చిన మస్తాన్‌వలి, షావలి, ముంతాజ్, గుల్జార్ తదితరులు 50 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టి తోలి వంకను పూడ్చివేశారన్నారు. అంతేకాకుండా సిమెంటు బ్లాకులతో ఫెన్సింగ్ కూడా వేశారన్నారు. దీనిపై మదనపల్లె తహసీల్దార్‌ను విచారించాల్సిందిగా ఆదేశించాలని విన్నవించారు. మదనపల్లె పట్టణం, రామసముద్రం, నిమ్మనపల్లె మండల కేంద్రాల్లోని హోటళ్లు, బేకరీల్లో నాణ్యత లేని ఆహార పదార్థాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతీస్తున్నారని వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హోటళ్లు, కొన్ని రెస్టారెంట్‌లలో కుళ్లిన మాంసం వండుతున్నారని, దీనిపై ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. దీనిపై విచారించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో వక్ఫ్ చట్టం వ్యతిరేకించడం పేరుతో కొందరు హింసాకాండకు పాల్పడ్డారని, వెంటనే ఆ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పాలన తీసుకురావాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వీటితో పాటు భూ సమస్యలు, సర్వే సమస్యలు, పాసుపుస్తకాల మ్యుటేషన్ తదితర అంశాలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. వీటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆయా మండలాల తహసీల్దార్లను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీపై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, కూటమి నాయకులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై సోమవారం తంబళ్లపల్లెలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక హరిత కూడలి వద్ద ఎస్సీ వర్గీకరణ అమలుకు కృషి చేసిన పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు నరేంద్ర మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో అనాదిగా వెనుకబడిపోయిన మాదిగల జీవితాల్లో ఇకపై కొత్త వెలుగులు ప్రసరిస్తాయని ధైర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి వేటా మల్లికార్జున, వెంకటప్ప, గోపిదిన్నె మల్లి, గంగాధర, వెంకట్రమణ, బొజ్జప్ప, రామాంజులు, చిన్నకృష్ణ, వెంకట్రమణ, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, బీసీ నాయకుడు పురుషోత్తం, వీరాంజినేయులు, ఉత్తమ్‌రెడ్డి, జగదీష్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు భేష్

● ఏఎంవో కృష్ణవేణి

పీలేరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి); గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఏర్పాట్లు భేష్‌గా ఉన్నాయని ఏఎంవో కృష్ణవేణి అన్నారు. సోమవారం ఆమె కేవీపల్లె మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్షలు జరుగుతున్న తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏర్పాట్లు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా వేసవి సెలవుల్లో రెమెడియన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వంద శాతం ఫలితాలే లక్ష్యంగా పాఠ్యబోధన కొనసాగించాలని తెలిపారు. ఈ రోజు జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షకు 109 మంది హాజరు కావాల్సి వుండగా 102 మంది హాజరయ్యారు. ఏఎంవో వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. రెడ్డిప్రదీప్ ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

కలకడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. పరీక్షలకు 77 మంది దరఖాస్తు చేసుకోగా 76 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా ఫలితాల విడుదల అనంతరం అడ్మిషన్‌లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మలాంషావలి తెలిపారు.

ప్రవేశ పరీక్షలు విజయవంతం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలు విజయవంతమైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. 73 మంది దరఖాస్తు చేసుకోగా అందరూ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. కాగా ఈ పరీక్షలకు సంబంధించిన మెరిట్ లిస్టు ఈనెల 27వ తేదీన విడుదలవుతుందన్నారు. ఆదర్శ పాఠశాలలో జరిగిన పరీక్షకు ఎంఈవో-2 గౌస్‌పీర్ డీవోగా (డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా), ప్రిన్సిపాల్ శివకుమారి చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు.



కేవీపల్లె మోడల్ స్కూల్‌లోని గురుకుల ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఎంవో కృష్ణవేణి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

● పీలేరు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి

పీలేరు రూరల్, 21 (ఆంధ్రజ్యోతి); సమాజ వికాసం కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని పీలేరు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, మెయిన్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పీలేరు పట్టణంలోని శ్రీనాథపురం ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ ఇన్ కార్యక్రమంలో భాగంగా 15మంది విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనాథపురం ఉర్దూ పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చినట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విలువలతో కూడిన, నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. సమావేశంలో శ్రీనాథపురం ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రహత్ బాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నటరాజ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు పోతంశెట్టి రమేష్, సత్యనారాయణ, టీడీపీ నేతలు సౌకత్, చాంద్‌బాషా, ఉపాధ్యాయ సంఘం నేతలు అక్రం బాషా, శెట్టిసుబ్రమణ్యం, సుధాకర్‌బాబు, సీఆర్‌పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

50 మంది విద్యార్థుల చేరిక

గుర్రంకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యను పూర్తి చేసిన విద్యార్థులను సోమవారం హైస్కూల్‌లో చేర్పించారు. గుర్రంకొండ పట్టణంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్య పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులను ఎంఈవో సురేంద్ర బాబు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్‌లో చేర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కలకడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని కోన క్లస్టర్ ఇన్‌చార్జి చెంగల్‌రాయులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల్లో చేర్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి వెంగన్నగారిపల్లె, గుడిబండ, బంగారువాండ్లపల్లెలో తల్లిదండ్రులను కలిశారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో ప్రభుత్వ బడుల్లో బోధన ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీ రాణి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వంటి వసతులు ఉంటాయని ఎంఈవో నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం తంబళ్లపల్లెలో పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను హైస్కూల్‌లో అడ్మిషన్ చేయించారు. కార్యక్రమంలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాసులు, రెడ్డప్పరెడ్డి ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను హైస్కూలులో అడ్మిషన్ చేయుస్తున్న ఎంఈవో నాగసుబ్బరాయుడు

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం

● సీడీపీవో నాగవేణి



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం వలన వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందడమే కాక పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని సీడీపీవో నాగవేణి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్ఎన్ తండా అంగన్వాడీ కేంద్రంలో పండ్లు, కూరగాయల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయలు, పౌష్టికాహార వంటల స్టాల్స్ ఏర్పాటు చేసి వాటి ప్రాధాన్యతను గర్భిణులు, చిన్నారుల తల్లులకు వివరించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ ప్రతి రోజు తినే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

అనాథలకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని పీఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ పీవీ శివశంకర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. సోమవారం బసినికొండ వద్ద కూరపర్తి సాయిచైతన్య అనాథాశ్రమంలో శివశంకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభరెడ్డి, పీఎస్ఆర్ గ్రూప్స్ ఎండీ రవీంద్రరెడ్డి, ఎం.యోగానందరెడ్డి, జి.భానుప్రకాష్‌రెడ్డి, చిప్పిలి చిన్న, ప్రవీణ్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పత్తి పంట పరిశీలన

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లెకు చెందిన తాళ్లపాక వెంకటరెడ్డికి చెందిన పత్తి పంట ఇటీవల కురిసిన వడగండ్ల వాన, ఈదురుగాలులకు పాక్షికంగా దెబ్బతింది. ఈ విషయాన్ని వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా సోమవారం ఏవో ప్రేమలత పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దళితుల భూసమస్యలను పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఏబీఎంఎస్ జేఏసీ నేతలు

పీలేరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళితుల భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత మాల సంఘాల (ఏబీఎంఎస్) జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గుర్రం నారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దారు భీమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.470/1లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని, గతంలో విజ్ఞప్తి చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. రేగళ్ల పంచాయతీ ఎల్లంపల్లె దళితవాడకు శ్మశాన వాటిక మంజూరు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన కరువైందన్నారు. రేగళ్ల పంచాయతీ శెట్టిపల్లె దళితవాడకు చెందిన ఆసాది గంగడు, ఆసాది సిద్దడు అనే వారికి 4.98 ఎకరాలకు బ్రిటీష హయాం పట్టా ఉన్నప్పటికీ రెవెన్యూ సిబ్బందిని లోబరుచుకుని కొంతమంది అగ్రకులస్థులు ఆ భూమిపై పట్టాదారు పాసుపుస్తకాలు పొందారన్నారు. అందుకు సంబంధించిన వెబ్ ల్యాండ్ హిస్టరీ కావాలని గ్రామసభలో విజ్ఞప్తి చేసినా ఇంతవరకు స్పందించలేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నక్కా వెంకటరమణ, గుండ్లూరు నాగరాజు, శివనందన్, మల్లికార్జున, నారాయణ, జయరామచంద్రయ్య, రమణ పాల్గొన్నారు.

ముస్లిం పేదలకు న్యాయం చేయడానికే వక్ఫ్ సవరణ చట్టం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



వక్ఫ్ సవరణ చట్టం పోస్టర్లను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పేద, బలహీన, బడుగు ముస్లింలకు, జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయడానికే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్ అన్నారు. సోమవారం స్థానిక సొసైటీకాలనీలోని బీజేపీ కార్యాలయంలో వక్ఫ్ సవరణ చట్టం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే సంపదను పేద ముస్లింల వైద్యానికి, విద్యకు, వితంతుల పోషణకు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు వినియోగించకుండా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ చట్టం తీసుకురావడంతో వారందరికీ మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా నాయకులు షబ్బీర్‌అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, పులి నరేంద్ర, పిల్లస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను జాగ్రత్తగా నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నేత తోట గిరిధర్

ములకలచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని జనసేన పార్టీ నేత, కవిత ట్రాన్స్‌పోర్ట్ అధినేత తోట గిరిధర్ సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం ములకలచెరువు ఆల్ వెహికల్స్ డ్రైవర్స్ అసోసియేషన్ తొలి ఆత్మీయ సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దన్నారు. అనంతరం కేజీఎన్, కేబీఎన్ టమోటా మండీ యజమానులు కట్టా గోవిందునాయుడు, కట్టా బాబునాయుడు, ఉమ్మడి రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, బాస్ నేత మంత్రాల రమణ, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు శంకర్‌నారాయణ, బయన్న, నాగరాజు, షబరీస్, శ్రీనివాసులు, ప్రవీణ్, అక్బర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కురబలకోట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టులో వెలసిన సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 21నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 21న అంకురార్పన, 22న ధ్వజారోహనం, 23న హనుమంత వాహనం, 24న సింహవాహనం, 25న శేషవాహనం, 26న గజవాహనం, 27న కల్యాణోత్సవం, గరుడోత్సవం, 28న రథోత్సవం, 29న అశ్వవాహనం, 30న హంసవాహనం, 1న భాష్యకార్లస్వామి గజవాహనం, 2న భాష్యకార్లస్వామి రథోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పంచాయతీ కార్మికులకు కోళ్ల వితరణ

పీలేరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన మనో రెడ్డి అనే వ్యక్తి దివంగతులైన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పంచాయతీ కార్మికులకు కోళ్లను వితరణగా అందజేశారు. మనో రెడ్డి తల్లిదండ్రులైన దివంగతులు విశ్రాంత హెచ్‌ఎం నారాయణ రెడ్డి, ఉపాధ్యాయురాలు హెలెన్ కుమారీలు పీలేరు పట్టణం పాత బస్టాండులోని మెయిన్ స్కూలులో సుదీర్ఘ కాలం సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్ బాషా, ఈవో గురుమోహన్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నారే వెంకటరమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.